సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 20 । జూన్ । 2023



ఆలయాలకు మహర్దశ 8లో▸

ధూప దీప నైవేద్యం పథకం ప్రారంభమైన నుంచి ఉమ్మడి జిల్లాలో 484 మంది అర్చకులను నియమించారు. తాజాగా ప్రభుత్వం మరో 154 పోస్టులు మంజూరు చేసింది.

నేటి దూరవిద్య పీజీ పరీక్ష వాయిదా

కైలాస్‌నగర్: కేయూ ఎస్‌డీఎల్‌సీఈ పరిధిలో ఈనెల 20న నిర్వహించాల్సిన ఎంఎస్సీ మ్యాథ్స్ ఫైనలియర్ పరీక్ష వాయిదా వేసినట్లు పరీక్షల విభాగం అదనపు కంట్రోలర్ నరేందర్ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవం పురస్కరించుకొని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. పరీక్షను జూలై 3న నిర్వహించనున్నట్లు తెలిపారు. విషయాన్ని విద్యార్థులు గమనించాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
41.0/31.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత కొనసాగనుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన



అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతుంది. 131 మంది అభ్యర్థులు సోమవారం స్లాట్ బుక్ చేసుకోగా కౌన్సెలింగ్‌కు 125 మంది హాజరయ్యారు. అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భరద్వాజ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు గాను గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఫౌండేషన్ పోస్టు 1, ఫిలాసఫీ 1, మ్యాథ్స్ 2, సైన్స్ 1, సాంఘిక శాస్త్రం1, తెలుగు 1, ఇంగ్లీష్ 1, ఫిజికల్ ఎడ్యుకేషన్ 1, విజువల్ అండ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ 1, కంప్యూటర్ ఎడ్యుకేషన్ 1, ఉర్దూ మీడియంలో ఫౌండేషన్ 1, మ్యాథ్స్ 1, సైన్స్ 1, సాంఘిక శాస్త్రం 1, ఉర్దూ 1 పోస్టులకు ఈనెల 30లో డైట్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎడ్, బీటెక్ విద్యార్హత గల వారు అర్హులని తెలిపారు. వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

జిల్లా కేంద్రంలో భారీ జాతీయ జెండా

- భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రామన్న



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామన్న

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద 150 అడుగుల భారీ జాతీయ జెండాను ఎన్‌టీటీ డాటా కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. రూ. 28లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ జెండా ఏర్పాటుకుగాను ఎమ్మెల్యే జోగు రామన్న సోమవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సోషల్ రెస్పాన్స్ నిధులతో జాతీయ జెండాను ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. ఇందుకు సహకరిస్తున్న కంపెనీ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి , కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న ట్రెయినీ కలెక్టర్ శ్రీజ

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అందించిన అర్జీలు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలని ట్రెయినీ కలెక్టర్ శ్రీజ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఆమె హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేస్తూ నిబంధనల మేరకు త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఆర్డీవో కదం సురేశ్, ఇన్‌చార్జి డీఆర్‌వో అరవింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎడ్ ప్రవేశాలకు రేపటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

కైలాస్‌నగర్: డీఎడ్- 2023లో ర్యాంక్ సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభ్యర్థులకు డీఎడ్‌లో ప్రవేశం కోసం ఈనెల 21 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ ఎ.రవీందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. 21న 1 నుంచి 450 వరకు, 22న 451 నుంచి 900 వరకు, 23న 901 నుంచి 1317 వరకు ర్యాంకు గల అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆసరాకు ఎదురుచూపు



ఈమె పేరు జాదవ్ రేణుక. బోథ్ మండలం సొసెర గ్రామానికి చెందిన ఈమె భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. ఇద్దరు పిల్లలున్నారు. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లగా ప్రభుత్వం వెబ్‌సైట్ నిలిపివేసిందని సిబ్బంది చెప్పారు. తనకు ఆసరా పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలంటూ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో విన్నవించినట్లు పేర్కొంది.



ఈ వృద్ధుడి పేరు రాథోడ్ అంబాజీ. వృద్ధాప్య పింఛన్‌కు అర్హుడైనా ప్రభుత్వం వెబ్‌సైట్‌ను నిలిపివేయడంతో దరఖాస్తుకు అవకాశం లేకుండా పోయింది. విషయం తెలియని ఈయన తనకు పింఛన్ మంజూరు చేయాలంటూ ఎంపీడీవో కార్యాలయంతో పాటు కలెక్టర్‌కు రెండేళ్లుగా విన్నవిస్తూనే ఉన్నాడు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. ఇది కేవలం వీరిద్దరి సమస్యనే కాదు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి వారు అనేక మంది ఉన్నారు.



- కొత్తవారికి దరఖాస్తు ఇక్కట్లు
- ఏళ్లుగా తెరుచుకోని వెబ్‌సైట్
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- గ్రీవెన్స్ అర్జీల్లో ఇవే అధికం

కైలాస్‌నగర్: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, బీడీ కార్మికులు తదితర వర్గాలకు అండగా నిలిచేందుకు గాను తెలంగాణ ప్రభుత్వం ఆసరా పథకం ద్వారా పింఛన్ అందిస్తోంది. అయితే కొత్తగా అర్హులైన వారికి ఏళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌లో అందే అర్జీల్లో ఇవే ఎక్కువగా ఉంటున్నాయి. మండలస్థాయిలో అధికారులను కలిసి వేడుకుంటున్న అర్హులైన వారికి పైనుంచే మంజూరు కావడం లేదనే సమాధానం వినిపిస్తుంది. ఈ క్రమంలో వారంతా కలెక్టరేట్‌కు చేరుకుని ఉన్నతాధికారులకు తమ గోడు విన్నవిస్తున్నారు. మరోవైపు ఇందుకోసం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌ను ప్రభుత్వం నిలిపివేయడంతో కనీసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండా పోతుంది. ఇప్పటికే డీఆర్డీవో పరిధిలో 5,840 దరఖాస్తులు ఆన్‌లైన్ చేసి ఉండడం గమనార్హం.

ఓల్డ్ ఏజ్ పింఛన్ స్పౌజ్‌కు మాత్రం అనుమతి

కొత్త పింఛన్ దరఖాస్తులు స్వీకరించని ప్రభుత్వం ఇటీవల ఓఏపీ (ఓల్డ్ ఏజ్ పింఛన్) స్పౌజ్ పింఛన్ మంజూరుకు మాత్రం అనుమతినిచ్చింది. ఓఏపీ పొందే వారిలో భర్త మరణిస్తే భార్య, భార్య మరణిస్తే భర్తకు పింఛన్ మంజూరు చేస్తున్నారు. అయితే దివ్యాంగుల విషయంలో ఇది వర్తించకపోవడంతో వారిని ఆందోళనకు గురి చేస్తుంది. వైకల్యం కలిగిన దివ్యాంగులను ఎంతో మంది సకాలంగులు వివాహం చేసుకుని జీవిస్తున్నారు. ఇందులో చాలామంది పరిస్థితి అధ్వానంగా ఉంది. దివ్యాంగులైన పింఛన్‌దారులు మరణించినట్లైతే ఆ కుటుంబం కష్టాలు మరింత ఎక్కువవుతున్నాయి.

గతంలో ఇలా

పింఛన్‌కు అర్హులైన వారు గతంలో గ్రామీణులైతే మండల పరిషత్, పట్టణ పరిధిలోని వారైతే మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునే వారు. ఆయా కార్యాలయాల్లో అందిన దరఖాస్తులను సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులైనట్లుగా తేలితే వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. అలాంటి వారి వివరాలను డీఆర్‌డీఏకు, అక్కడి నుంచి సెర్ప్ కార్యాలయానికి పంపించే వారు. అక్కడి నుంచి పింఛన్ మంజూరయ్యేది. అయితే ప్రభుత్వం 2019 జూలైలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్‌ను నిలిపివేసింది. దీంతో మండల, మున్సిపల్ అధికారులు కొత్తగా ఎలాంటి దరఖాస్తులు స్వీకరించడం లేదు. అయితే అప్పటికే అందిన దరఖాస్తుల నుంచి 2021లో హుజురాబాద్ ఉపఎన్నిక సందర్భంగా ప్రభుత్వం కొందరికి కొత్త పింఛన్లను మంజూరు చేసింది. మరికొందరివి పెండింగ్‌లో ఉన్నాయి. తర్వాత అర్హులైన వారికి కనీసం దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ సైతం అందుబాటులో లేకపోవడంతో వారంతా ప్రతీ సోమవారం గ్రీవెన్స్ బాట పడుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయంపైనే ఆధారం

ప్రభుత్వం పింఛన్ దరఖాస్తును నిలిపివేసింది. దీంతో కొత్తగా దరఖాస్తులు స్వీకరించేందుకు ఎలాంటి అవకాశం లేదు. విషయం తెలియక చాలామంది గ్రీవెన్స్‌కు వెళ్లి నివేదిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే పింఛన్ మంజూరవుతుంది. ఇప్పటికే ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం ఎప్పుడు ఆదేశాలు జారీ చేస్తే అప్పుడు కొత్త పింఛన్లను మంజూరు చేస్తాం.

– రాథోడ్ శేషరావు, ఏపీడీ (పింఛన్)

పచ్చని చెట్లు..ప్రగతికి మెట్లు



నాటిన మొక్కకు కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఘనంగా హరితోత్సవం

ఆదిలాబాద్‌రూరల్: పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లని, జీవకోటికి ప్రాణవాయువు అందించే వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మావల మండలంలోని హరితవనం పార్కు, ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా(టి) శివారులో అటవీ, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల శాఖల ఆధ్వర్యంలో సోమవారం వేర్వేరుగా హరితోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి కలెక్టర్ పాల్గొని మొక్కలు నాటారు. మావలలోని హరితవనంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్ అటవీశాఖ ప్రగతి నివేదికను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పథకం తెలంగాణకు హరితహారమన్నారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 4.63 కోట్ల మొక్కలు నాటి సంరక్షించినట్లు తెలిపారు. అలాగే జిల్లాలో అడవుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ, తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని ఓ యజ్ఞంలా భావించి మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆయాపాఠశాల్లో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, ఉత్తమ సేవలందించిన అటవీశాఖ సిబ్బందికి కలెక్టర్ ప్రశంసపత్రాలు అందించారు. జాతీయ జలశక్తి అవార్డు విభాగంలో జిల్లా మూడో స్థానంలో నిలిచిన నేపథ్యంలో కలెక్టర్‌ను ఎమ్మెల్యే, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, ఎంపీపీ గంద్రత్ రమేశ్, జెడ్పీటీసీ వనిత, డీఆర్డీవో కిషన్, ఆదిలాబాద్ రూరల్, మావల ఎంపీడీవోలు లక్ష్మీకాంత్‌రావ్, అరుణ పాల్గొన్నారు.

ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యం

ఆదిలాబాద్‌రూరల్: ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడలోని రెండో బెటాలియన్‌లో నర్సరీని ప్రారంభించారు. బెటా లియన్ కమాండెంట్ వేణుగోపాల్‌తో కలిసి మొక్కలు నాటారు. ఎంపీపీ గంద్రత్ రమేశ్, సర్పంచ్ గంగారాం, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్‌ఆర్ ప్రసాద్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, మెడికోలతో కలిసి మొక్కలు నాటారు.

పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో..

కైలాస్‌నగర్: ప్రతి ఒక్కరూ విధిగా రెండు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నటరాజ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం హరితోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని సాయి అగ్రో, రాజు, మారుతి ఇండస్ట్రీస్‌ల్లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో హరితహారం చేపట్టారు. డీఎస్‌వో కిరణ్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ డీఎం సుధారాణితో కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ బాబుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వరకే రాజకీయాలు..

- గ్రామాల అభివృద్ధికి అందరూ పాటుపడాలి
- ఎంపీ సోయం బాపూరావ్
- రుయ్యాడిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావ్, చిత్రంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ తదితరులు

తలమడుగు: రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, గ్రామాల అభివృద్ధికి అందరూ పాటుపడాలని ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. మండలంలోని రుయ్యాడి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్‌తో కలిసి సోమవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు గాంధీ, అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతనంగా నిర్మించిన రైతువేదిక భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, రెడ్డి సంక్షేమ సంఘ భవనం, పద్మశాలి సంఘ భవనంతో పాటు మన ఊరు–మన బడిలో భాగంగా రూ.33.50 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి రాజకీయాలను వాడుకోవద్దన్నారు. ఒకే గ్రామంలో అనేక సంఘ భవనాలు ఉండడం అభినందనీయమన్నారు. గ్రామ అభివృద్ధికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీ రాజేశ్వర్, ఎంపీడీవో రమాకాంత్, సర్పంచ్ పోతారెడ్డి, ఎంపీటీసీ సుశ్మిత, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మొక్క నాటి నీరందిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడి

ఆదిలాబాద్‌టౌన్: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం హరిత దినోత్సవం నిర్వహించారు. స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌తోపాటు బాలికల గురుకుల కళాశాలలో మొక్కలు నాటారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు కార్యాలయాలు, స్టేషన్లలో అధికారులు, సిబ్బంది మొక్కలు నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్.శ్రీనివాసరావు, సమయ్‌జాన్ రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జె.కృష్ణమూర్తి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకట్, ఎం.వంశీకృష్ణ, బి.శ్రీపాల్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన సీఐలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ టూటౌన్, ఆదిలాబాద్‌రూరల్ సీఐలుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎం.అశోక్, ఐ.సైదారావులు సోమవారం ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆదిలాబాద్ ట్రాఫిక్ సీఐగా పని చేసిన ఎం.అశోక్ బదిలీలో భాగంగా ఆదిలాబాద్ టూటౌన్‌లో బాధ్యతలు చేపట్టారు. అలాగే ఆదిలాబాద్ రూరల్ సీఐ బి.రఘుపతి స్థానంలో ఉట్నూర్ సీఐగా పనిచేసిన సైదారావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ ఇరువురు అధికారులతో పలు అంశాలపై చర్చించారు.

‘డబుల్’పై జాప్యమేల!

- తొలివిడత లక్కీడ్రాలో ఎంపికైనా.. లబ్ధిదారులకు ఇంకా కేటాయించని ఇళ్లు
- ముందుకు సాగని రెండో విడత
- పట్టించుకోని అధికారులు
- నిరుపేదలకు తప్పని ఎదురుచూపు



కేఆర్‌కే కాలనీలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇళ్ల కేటాయింపు కోసం ఇప్పటికే తొలి విడత లక్కీ డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసిన అధికారులు నెల దాటినా వారికి ఇప్పటి వరకు ఇళ్లను కేటాయించలేదు. మరో వైపు రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలోనూ తీవ్ర జాప్యం అవుతోంది. దీంతో అర్హులైన నిరుపేదలు డ్రా ఎప్పుడు నిర్వహిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు. దరఖాస్తుదారుల్లో అర్హులైన వారి లెక్క తేల్చిన అధికారులు లక్కీడ్రా నిర్వహణలో ఎందుకు జాప్యం చేస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

తొలి విడతలో 618 మంది ఎంపిక

నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీ, మావల గ్రామంలోని సర్వేనంబర్ 170లో జాతీయ రహదారి పక్కన 982 ఇళ్లను నిర్మించింది. వీటి కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. తొలివిడతలో భాగంగా గత నెల 9న కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డులో ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని 32 వార్డులకు సంబంధించిన దరఖాస్తుదారుల నుంచి లక్కీ డ్రా నిర్వహించారు. ఈ విడతలో 7,902 మంది దరఖాస్తు చేసుకోగా క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం 2,538 మందిని అర్హులుగా తేల్చారు. వీరిలో రిజర్వేషన్ల ప్రకారం లక్కీ డ్రా నిర్వహించి 618 మందిని ఇళ్ల కోసం ఎంపిక చేశారు. ఈ ప్రక్రియ ముగిసి నెల గడుస్తున్నా వారికి ఇప్పటివరకు ఇళ్లను కేటాయించలేదు. దీంతో డబుల్ బెడ్ రూం దక్కిందనే ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు అందులోకి ఎప్పుడు అడుగుపెడతామో అనే ఆశగా ఎదురు చూస్తున్నారు.

రెండో విడత డ్రా ఎప్పుడో...

తొలి విడతలో ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని పూర్వ కాలనీల దరఖాస్తులకు మాత్రమే లక్కీ డ్రా చేపట్టిన అధికారులు పట్టణంలో విలీనమైన మావల, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లోని కాలనీలతో పాటు పట్టణంలోని మిగిలిన రెండు కాలనీలకు సంబంధించిన దరఖాస్తుదారులకు రెండో విడతలో డ్రా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. 364 ఇళ్లకోసం మరోసారి దరఖాస్తులు స్వీకరించారు. ఇందుకు గాను 2,365 దరఖాస్తులు అందాయి. వాటిని క్షేత్రస్థాయిలో విచారించిన అధికారులు 1,123 మందిని అర్హులుగా తేల్చారు. ఈ జాబితాను సంబంధిత వెబ్‌సైట్‌కు పంపించారు. ఇందులో 758 మందిని అర్హులుగా గుర్తించింది. వీరికి రెండో విడత లక్కీ డ్రా నిర్వహించాల్సి ఉంది. అయితే మలి విడత డ్రాపై అధికారులు అంతగా దృష్టి సారించినట్లుగా కనిపించడం లేదు. దీంతో ఈ ప్రక్రియలో జాప్యం అవుతున్నట్లు తెలుస్తోంది.

త్వరలోనే నిర్వహిస్తాం..

దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయింది. ఇప్పటికే అర్హులను గుర్తించాం. ప్రస్తుతం ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంల పరిశీలన ప్రక్రియ జరుగుతుంది. ఈ ప్రక్రియ ముగిశాక కలెక్టర్‌ను సంప్రదించి త్వరలోనే లక్కీ డ్రా నిర్వహించేలా తేదీలను ఖరారు చేస్తాం.

– సతీశ్‌కుమార్, తహసీల్దార్, ఆదిలాబాద్ అర్బన్

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో విలీనమైన కాలనీలకు సంబంధించిన డబుల్ బెడ్‌రూం దరఖాస్తుల వివరాలు

మండలం	అందిన దరఖాస్తులు	అర్హులైన వారు	అనర్హులు	టీఎస్ వెబ్‌సైట్ ఆమోదించింది
ఆదిలాబాద్‌రూరల్	203	57	146	37
మావల	1959	917	1042	667
ఆదిలాబాద్‌అర్బన్	203	149	54	54

గొర్రెల పంపిణీ చేపట్టాలని ఆందోళన

- కలెక్టరేట్ ఎదుట గొల్లకుర్మల ధర్నా



ధర్నా చేస్తున్న గొల్ల, కుర్మలు

కైలాస్‌నగర్: డీడీలు చెల్లించిన గొల్ల, కుర్మలకు ప్రభుత్వం తక్షణమే గొర్రెలు పంపిణీ చేయాలని యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడు ప్రఫుల్‌యాదవ్, గొర్ల కాపరుల సంఘం అధ్యక్షుడు మంచాల మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. గొర్రెల పంపిణీలో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐదేళ్లుగా ఉపఎన్నికలు వచ్చిన ప్రతీసారి గొర్రెల పంపిణీ ప్రారంభిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదన్నారు. గొర్రెలు వస్తాయనే ఆశతో చాలామంది నిరుపేదలు అప్పు చేసి మరీ డీడీలు చెల్లించారన్నారు. ఇప్పటి వరకు వాటిని పంపిణీ చేయకపోవడంతో చేసిన అప్పులు తీర్చేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే లబ్ధిదారులందరికి గొర్రెలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆశన్న, గంగయ్య, రమేశ్, మల్లేశ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న మధ్యాహ్న భోజన కార్మికులు

కైలాస్‌నగర్: ప్రభుత్వం పెంచిన వేతనాలతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఏఐటీయుసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రాములు మాట్లాడుతూ, 18 ఏళ్లుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం గుర్తించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. పెండింగ్ బిల్లులతో పాటు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. అనంతరం ట్రెయినీ కలెక్టర్ శ్రీజకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాంబాబు, సుజాత, లక్ష్మి, చంద్రకళ, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం


పిట్ల బాపూరావ్

బోథ్: తిరుమలలో తప్పిపోయిన బోథ్‌కు చెందిన పిట్ల బాపూరావ్ ఆచూకీ లభ్యమైంది. ఆపసోపాలు పడి సోమవారం ఇంటికి తిరిగిరావడంతో కుటుంబసభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలకేంద్రంలోని కొత్తకాలనీకి చెందిన పది మందితో కలిసి పిట్ల బాపూరావ్ వారం క్రితం తిరుమలకు వెళ్లాడు. దర్శనంలో భాగంగా క్యూలో తప్పిపోయాడు. వారు తిరుమల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తిరుపతి నుంచి తెలియక బెంగుళూరుకు రైలులో వెళ్లాడు. అక్కడి పోలీసులు ఆయన ఆధార్‌కార్డు ఆధారంగా నాందేడ్ రైలు ఎక్కించారు. నాందేడ్‌లోని పోలీసులు ఆదిలాబాద్‌కు రైలులో పంపించగా, బోథ్ నుంచి 20 కి.మీ దూరంలోని బొందిడి వద్ద బాపూరావ్ దిగిపోయాడు. కాలినడకన ఇంటికి చేరుకున్నాడు. వారం రోజులుగా తినడానికి అనేక అవస్థలు పడ్డానని తెలిపాడు. పోలీసులు తన ఆకలి తీర్చారని, పలు ఆలయాల్లో తిన్నట్లు బాపూరావ్ తెలిపాడు.

డిగ్రీ పరీక్షల్లో 11 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో సోమవారం 11 మంది డిబార్ అయ్యారు. ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడడంతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పట్టుకుని డిబార్ చేసినట్లు కాకతీయ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ నరేందర్ తెలిపారు.

ఆటోను ఢీకొన్న బైక్

- నలుగురికి స్వల్పంగా, ఒకరికి తీవ్రగాయాలు

కడెం: కడెం–పెద్దూర్ రహదారిపై ఎదురుగా వస్తున్న ఆటోను బైక్ ఢీకొంది. ఈ ఘటనలో నలుగురికి స్వల్పంగా, ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కడెం నుంచి ఖానాపూర్ వైపు ఇద్దరు బైక్‌పై వెళ్తున్నారు. సోమవారం పెద్దూర్ సమీపంలో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నారు. పెద్దూర్‌కు చెందిన బీజేపీ నాయకుడు రవీందర్‌గౌడ్ క్షతగాత్రులను ఆటోలో ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై రాజు పేర్కొన్నారు. అయితే అప్పటికే మూలమలుపు వద్ద జరిగిన ప్రమాదంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డ వాళ్లను చూస్తూ..అజాగ్రత్తగా నడపటం వల్లనే ఆటోను ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు.

స్క్రాప్ దుకాణాల్లో అగ్ని ప్రమాదం


దుకాణంలో వ్యాపించిన మంటలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని జీఎస్ ఎస్టేట్ సమీపంలోని గణేశ్ మందిరం వద్ద గల రెండు స్క్రాప్ దుకాణాల్లో సోమవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శివాజీ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు సిగరేట్ తాగి పడేయడంతో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పేర్కొన్నారు.

ఆలయాలకు మహర్దశ


డీడీఎన్ పథకంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయం

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాలకు నిత్యం ధూప దీప నైవేద్యాలు జరగాలన్న ఉద్దేశంతో పాటు, అర్చకులకు ఉపాధి కల్పించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో ధూప దీప నైవేద్య(డీడీఎన్) పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా నెలకు గౌరవ వేతనం రూ. 2వేలు చెల్లించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ రూ.2వేలు ఉన్న వేతనాన్ని రూ.6 వేలకు పెంచారు.

- ఉమ్మడి జిల్లాకు 184 పోస్టులు మంజూరు
- ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నవారు 484 మంది
- తాజా నిర్ణయంతో 638కి చేరిన డీడీఎన్ అర్చకులు
- ఇటీవలే రూ.10వేలకు పెరిగిన గౌరవ వేతనం

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ప్రస్తుతం డీడీఎన్ అర్చకుల సంఖ్య	నూతనంగా మంజూరైన అర్చకుల సంఖ్య	మొత్తం
ఆదిలాబాద్	111	24	135
కుమురంభీం	69	09	78
మంచిర్యాల	142	18	160
నిర్మల్	162	103	265
మొత్తం	484	154	638

నిర్వహణ ఇలా..

దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ధూప దీప నైవేద్యం పథకం కొనసాగుతుంది. ఆలయాల్లో విధులు నిర్వహించే అర్చకులు ప్రతీరోజు ఆలయంలో నిత్యపూజ, నైవేద్యంతో పాటు పండుగలు, ఉత్సవాల సమయాల్లో ప్రత్యేక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాల్సి ఉంటుంది. ప్రభుత్వం ప్రస్తుతం డీడీఎన్ అర్చకులకు నెలకు రూ.6వేలు చెల్లిస్తుండగా అందులోంచి నూనె, ప్రసాదం, ఇతర ఖర్చులకు రూ.2వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. సీఎం కేసీఆర్ ఇటీవల మంచిర్యాల పర్యటనలో భాగంగా డీడీఎన్ అర్చకులకు ఇచ్చే వేతనం రూ.10వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు.

ఉమ్మడి జిల్లాలో 484 మంది అర్చకులు

పథకం ప్రారంభమైన నాటి నుంచి నాలుగు విడతలుగా 484 మంది అర్చకులను నియమించారు. తాజాగా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 154 పోస్టులకు నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో వీటి సంఖ్య 638కి చేరింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 9, మంచిర్యాలలో 18, ఆదిలాబాద్‌లో 24, నిర్మల్‌లో 103 ఆలయాలకు అర్చకులను నియమించింది. వీరికి ఈనెల 25న ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ఉత్తర్వులు అందజేయనున్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల్లో అర్చకులకు డీడీఎన్ పథకంలో అవకాశం కల్పించడం హర్షణీయం. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. కానీ జిల్లాలో కేవలం 9 మందికే అవకాశం కల్పించడంతో చాలామందికి నిరాశే మిగిలింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి పూర్తిస్థాయిలో అర్చకులకు అవకాశం కల్పించాలి.
– గంగు సత్యనారాయణశర్మ, డీడీఎన్ సంఘం జిల్లా కార్యదర్శి

నియామకాల్లో పారదర్శకత

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీడీఎన్ పోస్టుల నియామకాల్లో పారదర్శకత పాటించాం. దరఖాస్తులను పరిశీలించి, ఆలయాలను తనిఖీలు చేసి, అర్హులైన వారిని గుర్తించాం. అర్చకులు సక్రమంగా విధులు నిర్వర్తించాలి. తనిఖీల్లో పట్టుపడితే శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. సమయపాలన పాటించాలి.
– నవీన్‌కుమార్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఉమ్మడి ఆదిలాబాద్

మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

పాతమంచిర్యాల: ఆయుష్మాన్ భారత్ ఇన్సూరెన్స్ కార్డులు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాండూర్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో సోమవారం వివరాలు వెల్లడించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాయిని బాపు సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో మాదారం, తిర్యాణి, దేవాపూర్, కాసిపేటలలో పలువురు అమాయక గిరిజనులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇస్తామని చెప్పి నకిలీ కార్డులు చూపించి నమ్మించాడు. బయోమెట్రిక్ యంత్రంలో వేలుముద్రలు స్కాన్ చేసి పదిమంది ఖాతాల్లోంచి రూ.2.73 లక్షలు తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. బాధితులు మాదారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తాండురు ఐబీలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సోమవారం పట్టుబడ్డాడు. నిందితుడిని విచారించగా నేరం ఒప్పుకోవడంతో అతనిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుడి వద్ద నుంచి హీరోహోండా బైక్, బయోమెట్రిక్ మిషన్, రెండు ఫోన్లు, నకిలీ ఆయుష్మాన్ భారత్ కార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో మాదారం ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


సంగీత (ఫైల్)

గుడిహత్నూర్: విద్యుత్‌షాక్‌తో మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని కొల్హారీ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఇంద్రవెల్లి మండలం జాలంతండాకు చెందిన సంగీత (33), కొల్హారీకి చెందిన తగరే కోర్బాన్‌తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు చిన్నారులు బబ్లూ, రాహుల్. దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఎప్పటిలాగే సంగీత చిన్నారులను బడికి పంపి ఇంటి పనుల్లో నిమగ్నమైంది. ఈ క్రమంలో మంచానికి ఆనుకొని ఉన్న ఇనుప కూలర్‌కు ఆమె కుడిభుజం తగిలి కరెంట్ షాక్‌కు గురైంది. ఆ భాగం పూర్తిగా కాలిపోయింది. ఇంటి నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి కరెంట్ ఆఫ్ చేశారు. అప్పటికే సంగీత మృతి చెంది ఉంది. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బాధిత కుటుంబానికి ఏఈ గౌతం రూ.10 వేల నగదు అందజేశారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- డీడీ దిలీప్‌కుమార్


అర్జీలు స్వీకరిస్తున్న దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: అర్జీలు సత్వరం పరిష్కరించాలని డీడీ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. అంతకు ముందు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన హరితదినోత్సరం పురస్కరించుకొని ఐటీడీఏ ఆవరణలో అధికారులు సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఓఎస్డీ కృష్ణయ్య, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, ఐటీడీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- దంతన్‌పల్లి పీహెచ్‌సీలో అటెండర్ ఉద్యోగం ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలానికి చెందిన కుమ్ర సత్యవతి అర్జీ సమర్పించింది.
- ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి (చెరువుగూడ) గ్రామానికి వసతి గృహం మంజూరు చేయించాలని సోయం జంగు కోరాడు.
- డిగ్రీ కళాశాలలో స్వీపర్‌గా ఉద్యోగం ఇప్పించాలని ఆసిఫాబాద్ మండలం కేస్లాపూర గ్రామానికి చెందిన టేకం కవిత విన్నవించింది.

ప్రమాదవశాత్తు ఒర్రెలో పడ్డ ట్రాక్టర్

- డ్రైవర్ మృతి


బోల్తాపడిన ట్రాక్టర్

పెంబి: దుక్కి దున్నుతుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తు ఒర్రెలో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై రజినీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన టేకం జీవన్ (35) తనకు ఉన్న ట్రాక్టర్‌తో రావిగడ శివారులో సోమవారం దుక్కి దున్నుతున్నాడు. ప్రమాదవశాత్తు చిన్న ఒర్రెలో ట్రాక్టర్ పడి పల్టీ కొట్టడంతో జీవన్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సునీత, ఏడాది వయస్సు ఉన్న కుమారుడు ఉన్నాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదారమ్మకు హారతి



భైంసా: బాసరలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం బాసర ఆలయం నుంచి గోదావరి నది వరకు పూజార్లు, సిబ్బంది, అధికారులు భక్తులతో కలిసి నృత్యాలు చేస్తూ వెళ్లారు. గోదారమ్మకు హారతి ఇచ్చారు. మహిళల కోలాటం, భజనలు, నృత్యాలతో గోదావరి నది పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కనిపించాయి.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఏఐసీసీ ఆదివాసీ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్


అభివాదం చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు ఏఐసీసీ ఆదివాసీ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక తిరుమల ఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ చౌహాన్ అధ్యక్షతన సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్టీ సెల్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బెల్లయ్య నాయక్ హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని కార్యకర్తలకు ఇంటింటికెళ్లి వివరించాలన్నారు. పార్టీ అధికారంలో వస్తే సిలిండర్ రూ.500, బస్సులో ఉచిత ప్రయాణం, రూ.2 లక్షల రుణమాఫీ, 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తుందని అవగాహన కల్పించాలన్నారు. ప్రజల్లో తిరిగే నాయకులకు గుర్తింపు ఉంటుందని, టికెట్ నిర్ణయించేది అధిష్టానమే అని తెలిపారు. జిల్లాలో ఉన్న పది సీట్లు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని తెలిపారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు గోమాసే శ్రీనివాస్, వెడ్మ భొజ్జు పటేల్, డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, నరేశ్‌జాదవ్, విశ్వప్రసాద్, మర్సుకోల సరస్వతి, సెడ్మకి ఆనంద్‌రావు, మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రభాకార్, పుర్కబాపురావు తదితరులు పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత


దేశీదారును పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

బోథ్: మండలంలోని నాగుగుడ సమీపంలో దేశీదారు బాటిళ్లతో వెళ్తున్న ఒకరిని ఎక్సైజ్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ రాజమౌళి కథనం ప్రకారం.. సొనాల గ్రామానికి చెందిన కటారి దశరథ్ దేశీదారు బాటిళ్లను మోపెడ్‌పై తీసుకువసున్నారని సమాచారం అందింది. ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద కాపు కాస్తుండగా నాగగూడ వద్ద తనిఖీ చేశారు. 200 దేశీదారు బాటిళ్లు లభ్యం కాగా, వీటి విలువ రూ.8 వేలు ఉంటుందని తెలిపారు. దశరథ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాకేశ్, ఎక్సైజ్ ఎస్సైలు రాజేశ్వర్, లోబానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

స్కానింగ్ కోసం గర్భిణుల పాట్లు!


క్యూలో నిలబడిన గర్భిణులు

భైంసాటౌన్: భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రిలో గర్భిణులు, రోగులు స్కానింగ్ కోసం ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో వైద్యపరీక్షల కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చింది. దీనికి తోడు స్కానింగ్ గది వద్ద రోగులు, వారి బంధువుల రాకపోకలతో తోపులాటతో గర్భిణులు ఇబ్బందులు పడ్డారు.

విద్యుత్ ప్రమాదంలో కాంట్రాక్టు ఉద్యోగికి గాయాలు

సారంగపూర్: విద్యుత్ ప్రమాదంలో కాంట్రాక్టు ఉద్యోగికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని గోపాల్‌పేట్‌కు చెందిన విద్యుత్ శాఖ కాంట్రాక్టు ఉద్యోగి రాజేశ్వర్.. ఓరైతు తన పొలంలో విద్యుత్ సరఫరాలో సమస్య ఉండటంతో సోమవారం ఆయనకు సమాచారం ఇచ్చాడు. లైన్‌లో సమస్య ఉందని సరిచేసేందుకు(ఎల్‌సీ) స్తంభం ఎక్కి రాజేశ్వర్ మరమ్మతు చేస్తుండగా వైరుకు సరఫరా రావడంతో ఆయన చేయి కాలిపోయింది. రైతు అతన్ని నిర్మల్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించాడు. ఈవిషయమై విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా తనకు విషయం తెలియదన్నారు. ప్రస్తుతం రాజేశ్వర్ ఆరోగ్యం నిలకడగా ఉందని, అతన్ని డిశ్చార్జ్ చేయించి గ్రామానికి పంపించినట్లు ఏఈ సాయికిరణ్ తెలిపారు.

వర్షం కురవాలని రుద్రాభిషేకం

బోథ్: వర్షాలు ఆలస్యమవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. విత్తనాలు సైతం ఇంకా విత్తలేదు. వర్షం కురవాలని కోరుతూ రైతులు, గ్రామస్తులు మండల కేంద్రంలోని శివభక్త మార్కండేయ ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. వానలు సమృద్ధిగా కురవాలని మొక్కుకున్నారు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ సభ

ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఆవిర్భావ సభ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన సభకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయన్ను పార్టీ నాయకులు మావల మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 నుంచి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి నిర్వహించిన బైక్ ర్యాలీని ఆదిలాబాద్‌లోని వివిధ చౌక్‌ల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ అంబేద్కర్, పూలే, మహాత్మా జ్యోతిబాపూలే, కాన్షీరాం ఆశయాల సాధన కోసం కృషి చేయాలన్నారు.

హరితహారం అడ్డుకున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని బావోజీపేట్ గ్రామంలో సోమవారం అటవీ అధికారులు చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. గత ఏడాది నుంచి గ్రామానికి వచ్చే త్రీఫేజ్ కరెంట్ రాకుండా అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న సిరిచెల్మ టైగర్ జోన్ అటవీ అధికారి వాహబ్ అహ్మద్ అక్కడికి చేరుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడారు. త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కోసం సహకరిస్తామని చెప్పడంతో వారు శాంతించారు. తర్వాత హరితహారం కార్యక్రమాన్ని అటవీశాఖ అధికారులు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

భైంసాటౌన్: ముధోల్ మండలం తరోడ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం.. కుబీర్ మండలం దొడర్న తండా–4కు చెందిన జాదవ్ అనిల్(27) నిజామాబాద్‌లోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి నిజామాబాద్‌లో హోటల్ యజమాని శుభకార్యానికి హాజరై తిరిగి బైక్‌పై భైంసా వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో తరోడ వద్ద భైంసా వైపు నుంచి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారమందుకున్న ఎస్సై అక్కడికి చేరుకుని మృతదేహాన్ని భైంసాలోని ఏరియాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య నిఖిత ఉన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతిభ పురస్కారాలకు ఎంపిక


పీజీ.రెడ్డి


డాక్టర్ సుధాకర్


రవికుమార్


సుభాష్


పవన్ పాండే

నిర్మల్ రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగే విద్యా దినోత్సవంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, అధ్యాపకులకు రాష్ట్ర కళాశాల విద్యాశాఖ పురస్కారాలు ప్రదానం చేయనుంది. జిల్లా నుంచి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎం.సుధాకర్ (ప్రిన్సిపాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భైంసా), ఉత్తమ అధ్యాపకులుగా డాక్టర్ పవన్‌కుమార్ పాండే (హిందీ సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భైంసా), పీజీ.రెడ్డి (చరిత్ర సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్), యూ.రవికుమార్ (ఆంగ్ల సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్), గోనెల సుభాష్(ఆంగ్ల సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భైంసా) ఎంపికయ్యారు. వీరిని మంగళవారం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో సత్కరిస్తారు.

దివ్యాంగుల అవస్థలు





నూతన సమీకృత కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తొలి ప్రజావాణిలో అర్జీదారులు, దివ్యాంగులు వసతులు లేక అవస్థలు పడ్డారు. జిల్లాకేంద్రానికి 5 కి.మీ దూరంలో ఈ కార్యాలయం ఉంది. ఆటోలో రావాలంటే రూ.200లు ఖర్చవుతుందని వాపోయారు. దివ్యాంగుల కోసం ఏర్పాట్లు చేయకపోవడంతో వారికి ఇక్కట్లు తప్పలేదు. అధికారులు సమయానికి రాకపోవడంతో గంటల తరబడి పడిగాపులు కాశారు. అర్జీదారులు నిరీక్షించి వెళ్లిపోయారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

కార్మికుల సంక్షేమానికి కృషి


బీడబ్ల్యూఐ డైరెక్టర్ రాజీవ్‌శర్మను కలిసిన కార్మిక సంఘం ప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా: అంతర్రాష్ట్ర వలస కార్మికులు, గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కృషిచేయాలని ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల కోరారు. సంఘ ప్రధాన కార్యదర్శి నయిండ్ల రాజారెడ్డితో కలిసి బిల్డింగ్ అండ్ వుడ్ వర్కర్స్ ఇంటర్నేషనల్ కార్మిక సంఘం (బీడబ్ల్యూఐ) దక్షిణాసియా ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ రాజీవ్ శర్మతో హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో సోమవారం భేటీ అయ్యారు. భవన నిర్మాణ రంగం కార్మికులకు శాశ్వతంగా గుర్తింపు కార్డు, బీడీ కార్మికులందరికీ పీఎఫ్ సౌకర్యం కల్పించడంపై చర్చించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రేరణశర్మ తదితరులు ఉన్నారు.